క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తి టౌన్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి హైదరాబాద్‌లో ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి చేసిన కృషి అభినందనీయమన్నారు.

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన చెరుకూరి



మల్లన్నకు మొక్క అందజేస్తున్న మౌనిక

జనగామ: తెలంగాణ ప్రజల తరుపున ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీతో కలిసి ముందుకు సాగేందుకు నిర్ణయం తీసుకున్నట్లు జనగామకు చెందిన చెరుకూరి మౌనిక యాదవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆమె మాట్లాడుతూ మెజారిటీ ప్రజలు బీసీ వర్గాలకు అధికారం దక్కాలనే బలమైన నినాదంతో తీన్మార్ మల్లన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించారన్నారు. మల్లన్న నాయకత్వాన్ని ప్రజలు నమ్ముతున్నారన్నారు. హైదరాబాద్ తాజ్ కృష్ణ హోటల్ వేదికగా జరిగిన పార్టీ ప్రారంభ వేడుకల్లో మల్లన్నను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సన్మానం



జనగామ: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఇటీవల రాష్ట్ర ఉత్తమ టీచర్‌గా అవార్డు అందుకున్న 14వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రమేశ్‌బాబును జీవన్ గ్రీన్ హోప్ సొసైటీ చైర్ పర్సన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.జ్యోతి, జె.వాణి, ఎ.అరుణ జ్యోతి, వి. సంతోష్ కుమార్, నాయకులు గన్ను కార్తిక్, వేణు గౌడ్, భాగ్యలక్ష్మి, బింగి విజయ, సుజాత, మనోజ్ ఉన్నారు.

ఎంపీడీఓకు..

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీల ఉద్యోగులు నూతనంగా విధుల్లో చేరిన ఎంపీడీఓ మమతాభాయ్‌ని కలిసి శాలువాతో బుధవారం సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు అందించాలని, జీపీ నాన్ మల్టీ పర్పస్ ఉద్యోగులను ఆన్‌లైన్ చేయకపోవడంతో వారికి వేతనాలు సక్రమంగా రాక అవస్థలు పడుతున్నారని అన్నారు. జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

‘స్వచ్ఛతాహీ సేవా’లో ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ, సిబ్బంది తదితరులు

లింగాలఘణపురం: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీఓ రఘురామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సీతరామనాయులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పూర్తయ్యేదెప్పుడో?

- నిడిగొండ–పడమటిగూడెంలో ఆరు నెలల క్రితం కంకర పోసి వదిలేసిన దుస్థితి
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నిడిగొండ బతుకమ్మ విగ్రహాల ఎదుట పోసిన కంకర

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ నుంచి పడమటిగూడెం మీదుగా యశ్వంతాపూర్ క్రీస్తు జ్యోతి ఇంజనీర్ కళాశాల వరకు సీఆర్ఆర్‌లో రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన బీటీ రహదారి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆరు నెలల క్రితం కంకర పోసి వదిలేయడంతో ఈ రోడ్డుపై బైకులు, సైకిళ్లు కూడా వెళ్లలేని స్థితిలో ఉంది. దీంతో నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణించే తూర్పుగూడెం, పడమటిగూడెం, నిడిగొండ, కుందారం, నవాబుపేట, నెల్లుట్ల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో గుంతల రోడ్డుతో ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రత్యేక చొరవతో బీటీ రోడ్డు మంజూరైంది. ఇందులో మూడు కాజువే, 5 కల్వర్టులు వేయాలి. పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ మట్టి రోడ్డుపై కంకర పరిచి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పోసిన కంకరపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంట్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బతుకమ్మ ఆడేది ఎలా..

నిడిగొండ చెరువు గట్టు వద్ద యేటా బతుకమ్మ ఉత్సవాలు జరుపుకునే బతుకమ్మ విగ్రహాల వద్ద కంకర పరిచి ఉండటంతో బతుకమ్మ ఎలా ఆడాలని మహిళలు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే స్పందించి బతుకమ్మ ఆడే స్థలంలో మహిళల సౌకర్యం కోసం కాంట్రాక్టర్‌తో కంకరపై డస్ట్ పోయించి, రోలింగ్ చేయించి బీటీ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత పీఆర్ డీఈ రవీందర్‌ను వివరణ కోరగా నిధుల కొరతతో పాటు వర్షాల కారణంగా బీటీ నిర్మాణం జాప్యం జరుగుతోంది. నిడిగొండ బతుకమ్మ విగ్రహాల వద్ద గురువారం పరిశీలించి మహిళలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకుంటాం.

కంకరపై తీవ్ర ఇబ్బందులు



బీటీ రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నిత్యం రైతులు, పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల క్రితం కంకర పోసి వదిలేయడంతో కంకరపై బైకులు కూడా నడవలేని స్థితిలో ఉంది. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. పనులు వెంటనే కొనసాగేలా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

\- కొంగరి నర్సింగరావు, నిడిగొండ

బతుకమ్మ ఎలా ఆడుతరు..



గ్రామ చెరువు గట్టు వద్ద బతుకమ్మ విగ్రహాల ముందు కంకర పోసి వదిలేశారు. బతుకమ్మ ఉత్సవాలు ఎలా జరుపుకోవాలి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. పడమటిగూడెం వెళ్లేందుకు కంకరపై ప్రయాణం చేయలేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

\- బి.తానాజీ, మాజీ ఉపసర్పంచ్, నిడిగొండ

రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు

తరిగొప్పుల: ఎస్ఎంఏఎం పథకంలో భాగంగా 2025–26 సంవత్సరానికి గాను రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందించడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి మనోహిత్ విక్రమరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, రోటవేటర్, సీడ్, ఫర్టిలైజర్ డ్రిల్, డిస్క్ హారో, కల్టివేటర్, ఎంబీ ప్లౌ, కేజ్ వీల్స్, పడ్లర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్, వరి గడ్డి కట్టల మిషన్ వ్యవసాయ యంత్రాలు, పరికరాలు కేటాయించడం జరిగిందన్నారు. చిన్న, సన్నకారు రైతులు ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం రాయితీ, బీసీ, ఓసీ ఇతరులకు 40 శాతం రాయితీపై ఇవ్వడం జరుగుతుందన్నారు. రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టపాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్సు దరఖాస్తు ఫారాన్ని జతపరచి సంబంధిత ఏఈఓను సంప్రదించవలసిందిగా ఆయన పేర్కొన్నారు. ట్రాక్టర్ సంబంధిత యంత్రాలకు ఆర్సీ కార్డు జిరాక్సును తీసుకొని రావాల్సిందిగా తెలిపారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



జనగామ రూరల్: రక్తదానం చేస్తున్న జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్



బచ్చన్నపేట: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పలు మండల కేంద్రాల్లో బీజేపీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాలు ఎగురవేసి, కేక్‌లు కట్ చేసి ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాగా, మోదీ జన్మదినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో, పాలకుర్తిలో పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తాన్ని ఇచ్చారు.

భగవాన్ విరాట్ విశ్వకర్మ జయంతి



జనగామ: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విప్ బీర్ల అయిలయ్య



చిల్పూరు: విశ్వకర్మ జెండాను ఆవిష్కరిస్తున్న రవీంద్రాచారి

జనగామ: భగవాన్ విరాట్ విశ్వకర్మ జయంతి పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్ షాలోమ్, డీసీపీ రాజమహేంద్రం నాయక్‌తో కలిసి విప్ అయియల్య జ్యోతిప్రజ్వలన చేసి, భగవాన్ చిత్ర పటానికి పూల మాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ ఐలయ్య మాట్లాడుతూ విశ్వకర్మ భగవాన్ దేవతల కోసం ఆయుధా లు, నగరాలు, రథాలను సృష్టించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్, జెడ్పీ సీఈవో మాధురీ షా, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామేశ్వరచారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు గంగాభవాని, పట్టణ వడ్రంగి సంఘం అధ్యక్షుడు సాంబయ్య, కార్పెంటర్స్ సంఘం ఉపాధ్యక్షుడు సిద్దిరాములు, ఏఎంసీ చైర్మన్ శివరాజ్ యాదవ్, జిల్లా గౌడసంఘం ప్రధాన కార్యదర్శి వెంకటమల్లయ్య, జాయమల్లేశం, మదార్, శివరాత్రి దుర్గయ్య, శ్రీనివాస్, నరసింహారావు, రవీందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని పంచగుళ్లలో, పట్టణ స్వర్ణకార సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వినయ్,స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ముత్తోజు రాజు, బాను చందర్,శ్రీపాద ఉప్పలాచారి, రామగిరి దామోదర్, కందుకూరి రాజేంద్రచారి, నంగునూరి వెంకటేశ్వర్లు, శ్రీపాద శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో డిమాండ్లు సాధించుకోవాలి

చిల్పూరు: విశ్వకర్మలు ఐకమత్యంగా ఉంటూ తమ డిమాండ్లను సాధించుకోవాలని సంఘం మండల అధ్యక్షుడు సంగోజు రవీంద్రాచారి అన్నారు. మండలంలోని వెంటేశ్వరపల్లి గ్రామంలోని విశ్వకర్మల స్థలంలో బుధవారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని జైవిశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిల్పూరు గ్రామ శాఖ అధ్యక్షుడు వీరనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రవీంద్రచారి మాట్లాడారు. వలబోజు బ్రహ్మచారి, కేశోజు నిరంజన్,నామోజు అశోకచారి, పానుగంటి విరాట్, లక్ష్మీనారాయణ, లింగమూర్తి, కనుకచారి, వీరనారాయణ, ఆకోజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దినోత్సవం



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్డీఓ కార్యాలయం వద్ద జెండావిష్కరణ చేస్తున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

సాక్షి నెట్‌వర్క్: ప్రజాపాలన దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ప్రజా పాలన లక్ష్యమని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది, పలు సంఘాల, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ మొహసిన్ ముజ్తాబా తదితరులు



తరిగొప్పుల: తహసీల్దార్ కార్యాలయంలో..



కొడకండ్ల: రైతువేదికలో..



బచ్చన్నపేట: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న డీపీఓ అంబికాసోని



పాలకుర్తి టౌన్: తహసీల్దార్ కార్యాలయంలో..



పాలకుర్తి: మార్కెట్ కమిటీ కార్యాలయంలో..



చిల్పూరు: ఎంపీడీఓ కార్యాలయంలో..



లింగాలఘణపురంలో..



జఫర్‌గఢ్‌లో.. తహసీల్దార్ రాజేశ్‌రెడ్డి



రఘునాథపల్లి: మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు

రిజర్వాయర్ల పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు?

పాలకుర్తి టౌన్: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో స్థానిక ప్రజలకు తేదీని ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాంమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలకు ఇంకా స్వేచ్ఛ లభించలేదని, ఇంకా బానిస బతుకు పోలేదని అన్నారు. దొరల, దొరసాని పాలన నుంచి విముక్తి కల్పించేందుకు బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్, నాయకులు దుంపల సంపత్,పబ్బ సంతోష్, పెనుగొండ సోమేశ్వర్, ఈర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. భారీ వర్షాలతో పలు గ్రామాల్లో కుంటలు మత్తడిలు పడగా కొత్తపల్లి, తాటికొండ గ్రామాలు, విశ్వనాథపురం, తానేదార్‌పల్లి గ్రామాల మధ్య కల్వర్టుల వద్ద రోడ్డుపై నుంచి భారీగా వర్షపు నీరు వెళ్లింది. వర్షంతో కల్వర్టులపై నుంచి వరదనీరు వెళ్లగా వాహనదారులు అవస్థలకు గురయ్యారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలో లోతట్టు ప్రాంతాల్లోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరగా కాలనీలు జలమయమయ్యాయి. దీంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు.

జాతీయ జెండాల ఆవిష్కరణ



జనగామ: జెండాను ఎగుర వేసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య



జనగామ: జెండాను ఎగుర వేసిన వివేకానంద సేవా సమితి ట్రస్టు అధ్యక్షుడు బాలసిద్దయ్య



జనగామ: డీసీసీ కార్యాలయం వద్ద వేడుకల్లో నాయకులు



జనగామ: వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ శివరాజ్‌యాదవ్



నర్మెట: జెండాకు వందం చేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించి సాయుధ అమరులకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఈఓ జి కళావతి



వస్తువులు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ కళావతి తదితరులు

దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న దాతల సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి జి.కళావతి సూచించారు. బుధవారం మండలంలోని పెద్దమడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అక్కల పరందాములు, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో రూ. 50 వేలతో క్రీడాదుస్తులు, బూట్లు, టై,బెల్టులు, స్థానిక హోమియోపతి వైద్యురాలు మమత అశోక్ రూ.10 వేలు బ్యాడ్జీల కోసం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను యాజమాన్యకమిటీ, ఉపాధ్యాయ బృందంతో ఘనంగా సన్మానించింది. హెచ్‌ఎం ఎం పద్మారాణి, పీఎస్ హెచ్‌ఎం బి.వెంకన్న , ఉపాధ్యాయులు పి ప్రతాప్, జి సత్యనారాయణ, జి రోజా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎం శారద, .ఎస్‌ఎంసి మాజీ చైర్మన్ బి రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రఘునందన్‌రెడ్డి

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఎంఈఓ రఘునందన్‌రెడ్డి కోరారు. మండలంలోని గబ్బెట ప్రాథమిక పాఠశాలలో తమ పిల్లల కోసం తల్లిదండ్రులు క్రీడా (ఏకరూప) దుస్తులు సమకూర్చుకోగా బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆటలాడే సమయంలో సౌకర్యవంతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో 57 మంది విద్యార్థులకు ఒక్కో డ్రెస్‌కు రూ.300 చొప్పున వెచ్చించి తల్లిదండ్రులు దుస్తులు సమకూర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునంద, ఉపాధ్యాయులు విజయమేరి, థామసమ్మ, శివకుమార్, ఉమదేవి తదతరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్యుల సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆండాళ్

దేవరుప్పుల: రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రజల చెంతకు చేరుస్తున్న ప్రత్యేక వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఆడెపు ఆండాళ్ సూచించారు. బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీసశక్త్ పరివార్ అభియాన్ కింద తలపెట్టిన ప్రత్యేక వైద్య నిపుణుల వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 14రోజుల పాటు ఆయా విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు రానున్నందున అవసరార్థులు సకాలంలో హాజరై వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ వైద్యులు దత్తురాజు 150 మందికి వైద్యచికిత్సలు చేసి అవసరార్థులకు పై ఆస్పత్రికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి సురేష్‌కుమార్, మండల వైద్యాధికారి రాజపురి రవితేజ, విజయ డెయిరీ జిల్లా చైర్మన్ ధర్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, డాక్టర్ మనోజ్ కుమార్, వెంకటలక్ష్మి, శ్రీ లక్ష్మి, శిరీష, జశ్విక, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, రామ్మూర్తి పాల్గొన్నారు.